# సీతగడియ

శ్రీరామభూపతికి దేవియైబుట్టి । కూర్మితోజనకుని కూతురై పెరిగి ।
అందమ్ము మెరయగా అత్తమామలకు । పరిచార్యలను సేయు పరమగురుభక్తి ।
పిలువకరాదాయె ప్రియునిదాపునకు । జాజులతలదాల్చి జవ్వాదియలది ।
వేచియుతానుండె వేడుకనువిభుడు । ఎదురెదురుచూచెను వెలదిరాదనుచూ ।
తడవయ్యెరాదని తొందరపడుచూ । సూర్యవంశజుడపుడు సొరిదికోపించి ।
ఘడియగ్రక్కునబెట్టె కాకుస్థుడపుడు । సీతరోసిపనులు చేయుటకాద ।
అపనిజమై మరచినీవున్నావ । అనుచుతలవంకించి కనుభ్రమవెంచి ।
శయ్యపైపవళించె రామచంద్రులు । వేవేగభూమిజ వేగతావచ్చి ।
అత్తకౌసల్యకు ఆడుగులువత్తి । మామదశరథులకు మడతలందించె ।
సుమిత్రకైరక సురటీలువేసి । పరగకౌసల్యకూ పానుపూపరచె ।
మజ్జనంబులుచేసి పసుపుల్లుజేసి । బంగారుపూలచీర బాగమరగట్టి ।
దువ్విపాపెటదీసి తింత్రిణీబెట్టి । తింత్రిణిలో ముత్యాలపతకంబుబెట్టి ।
రవ్వలముత్యాల జల్లిదిగవేసి । వెయిచేయరమ్ములా వెలయంగబెట్టి ।
రెండువేలుచేయు హారములువేసి , మూడువేలుచేయు ముక్కెరాబెట్టి ।
నాలుగువేలుచేయు నానుమెడవేసి । పదివేలుచేయు పతకంబుబెట్టి ।
గంటలావడ్డాణం కాంతతాబెట్టి । నీలాలుదాపిన కీలుకడియములు ।
నీలవర్ణునిదేవి నేవళంబెట్టి । కడనుంచికన్నులకు కాటుకాబెట్టి ।
నిలువుటద్దములోన తనరూపుజూచి । జూచిముచ్చటజెంది మగువవచ్చెనను ।
పంచభక్ష్యాన్నములు తానారగించి । శ్రీఘ్రంబుగాలేచి చేతులనుగడిగి ।
జిలుగుబుట్టేదారు పచ్చడంగప్పి । బంగారుకలశముతో నుదకంబుబెట్టి ।
ఆకుపోకలును మంచి యుత్తర్వుపునుగు । జవ్వాదిపలుపన్నీరు గంధంబు ।
పండ్లుఫలహారములు పళ్లెరమునుంచి । మల్లెలుమొల్లలు విరజాజులూను ।
కొప్పునముడిచియు సంతోషమునను । విభునిదగ్గరకేగి యిందిరాక్షి ।
విరులనుదెస్తినో వీరావతార । పుడమిలోవిరులకు కలనొగ్గకుండా ।
పరశురాముని భంగపరచితిరిమీరు । నన్నుయేలేస్వామి కాకుస్థతనయ ।
తలపేయకోపమును తాళంగగలనా । నిలుచున్నపాదాలు చేతులునొచ్చె ।

గడియ ఆలస్యమైన గడియ బెట్టితిరా | తప్పులు పట్టక తలుపు తీయండి
ఒంటిగా ఒక నిద్ర ఓ రామచంద్రా | నీలవర్ణ నను బాసి నిద్రెట్లు పట్టె

*[పుస్తకంలో లేనీ ఈ రెండు పాదాలు మలయవాసిని గారు పెన్సిల్తో రెండో పేజీ మొదటలో రాసుకున్నారు. అవి స్కాన్ కానందువలన ఇలా పాదసూచిగా ఇస్తున్నాము. - సం.]*

దంతపుతలుపులు తియ్యవోయినాథా । వొంటొంటిచినుకుకై ఒకచెంగుతడిసె ।
కాముడాతియ్యవోయి కనకంపుగడియ । పటపడచినుకులకు పైకొంగుతడిసె ।
పచ్చలబాలుడా తియ్యవోయిగడియ । నాలుగవఝామాయె నాప్రాణనాథా ।
రత్నహారంబిస్తు తియ్యవోయిగడియ । కరుణించిదీస్తివా కాళ్ళకడనైన ।
మంచిఒకనిద్రైన కరణొందిపోదు । అనగానురాఘవుండ పుడనియెనిట్లు ।
నిద్రపేరుచేకుంటె నాకేమిసీత । గంటవలెదీపమ్ము అదినాకుతోడు ।
నీవునిల్చుంటేను నాకేమిసీత । పువ్వులబుక్కాయ అదినాకుతోడు ।
నీవునిల్చుంటేను నాకేమిసీత । గంధముకస్తూరి అదినాకుతోడు ।
నీవునిల్చుంటేను నాకేమిసీత । పట్టెమంచంపరుపు అదినాకుతోడు ।
ఈరీతిచెప్పగా సీతకోపించి । అంకించిపోయెనే అత్తవాసముకు ।
అత్తకౌసల్యకు అన్నిచెల్పగను । తల్లికౌసల్యొచ్చె రాముదగ్గరకు ।
దశరథునిపుత్రుడవు జనకుల్లుడవు । భూమిదేవల్లుడవు బుద్ధిబరసీకు ।
సీతజేసినవన్నీ శ్రీభామనెప్పు । నాకుమొరిగించరా నినుగన్నతండ్రి ।
అమ్మనీకోడలిని అతిగౌరవమున । నలినాక్షిపెంచితే నన్నుగైకొనునా ।
చిరునవ్వునవ్వుచూ సూర్యవంశజుడు । రాముండుతీసెను రత్నాలగడియ ।
మామాపు దశరథులు ఒక్కరున్నారు । అత్తమీరుపొండి మామామకడకు ।
అనిచెప్పకౌసల్య తనమేడకేగె । సిగ్గుతోశ్రీలక్ష్మి విభునిసన్నిధికి ।
చేరగానేదివ్వె కలకలానవ్వె । ఆకులవాసనా పానుపుమీద ।
పోకలవాసనా పానుపుమీద । పువ్వులవాసనా పానుపుమీద ।
కస్తూరివాసన పానుపుమీద । పుష్పాలవాసన పానుపుమీద ।
బుక్కాలవాసన పానుపుమీద । ఆడవారికోపంబు యెట్టిపోయనుచు ।
మక్కువయుండెను రవివంశజుండు । అగ్గిమెంతనువెన్నెంత తడవగునోడ ।
ఆడవారికోపమ్ము అట్టిదేయనుచు । శ్రీభామకరిగెను శ్రీలక్ష్మియంత ।
వేశవిలాసముల క్రీడించెరాము । వైభోగవదనులతొ సుఖముగానుండె ।
పుడమిలోయీపాట పాడినావిన్నా । ఐశ్వర్యసంపతులయి అతిసుఖుండెదరు ॥